క్లుప్తంగా

దీపావళి శుభాకాంక్షలు

అద్దంకి: నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి పానెం చిన హనిమిరెడ్డి దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలందరికీ సకల శుభాలు, సంపదలు, విజయాలు కలగాలని ఆకాంక్షించారు.

బాణసంచా విక్రయదారులకు సూచనలు

ఇంకొల్లు (చినగంజాం): దీపావళి పండగను పురస్కరించుకొని ఇంకొల్లు గ్రామ పంచాయతీ ఆవరణలో ఏర్పాటు చేసిన షాపుల యజమానులతో ఎస్‌ఐ సురేష్ బుధవారం సమావేశం నిర్వహించారు. దుకాణదారులు దీపావళి మందులు విక్రయించే సమయంలో పాటించాల్సి నియమాలు గురించి తెలియజేశారు.

వీఆర్‌ఏల మండల కమిటీ ఎన్నిక

జె.పంగులూరు: మండల పరిధిలోని పంగులూరులో బుధవారం మండల వీఆర్‌ఏల నూతన కమిటీ ఎన్నుకున్నట్లు నిర్వాహకులు తెలిపారు. వీఆర్‌ఏల మండల అధ్యక్షునిగా కవలి వీరయ్య, ఉపాధ్యక్షునిగా మెట్లూరి ప్రవీణ్, సెక్రటరీగా బి. భాగ్యలక్ష్మి, కోశాధికారిగా కె. కోటేశ్వరరావు, గౌరవ అధ్యక్షులుగా వలేరు ఇస్తాసకు ఎన్నుకున్నట్లు తెలిపారు. కవల వీరయ్య మాట్లాడుతూ వీఆర్‌ఏల సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

మాస శివరాత్రి ప్రత్యేక పూజలు

కారంచేడు: మాస శివరాత్రి పర్వదినం పురస్కరించుకొని బుధవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండల కేంద్రమైన కారంచేడు పెద్ద బజారు శివాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మహిళలు, భక్తులు పెద్ద ఎత్తున ప్రత్యేక పూజలు చేసి స్వామివారికి నైవేద్యాలు సమర్పించారు. ఈ సందర్భంగా ఉదయం 8 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు శివనామ సంకీర్తనలు నిర్వహించారు. అర్ధ ఏకాహం నిర్వహించిన భక్తులకు ఆలయ అర్చకులు కారంచేటి వీరాంజనేయశర్మ తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

ప్రాథమిక పాఠశాల తనిఖీ

పర్చూరు (చినగంజాం): మండల పరిధిలోని చెన్నుబొట్ల అగ్రహారం ప్రాథమిక పాఠశాలను ఎంఈఓ పి. వెంకటరామయ్య బుధవారం తనిఖీ చేశారు. వార్షిక తనిఖీలో భాగంగా పాఠశాలకు వచ్చిన ఆయన పలు రికార్డులు పరిశీలించారు. తరగతి గదులలోకి వెళ్లి విద్యార్థులను పలు రకాల ప్రశ్నలు అడిగారు. బాగా చదువుకొని ఉన్నత స్థానాలకు చేరుకోవాలని సూచించారు. పాఠశాల రికార్డుల నిర్వహణ పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. ఉపాధ్యాయులు గనిపిశెట్టి గోవిందరావు, గుమ్మా లక్ష్మణరావు, కృష్ణంశెట్టి శ్రీనివాసరావు, రత్నమంజరి, సీఆర్పీ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు కౌన్సిల్ ఆమోదం

అద్దంకి రూరల్: అద్దంకి పురపాలన సంఘ చైర్‌పర్సన్ ఎల్. ఎస్తేరమ్మ ఆధ్యక్షత బుధవారం స్థానిక కౌన్సిల్ హాలులో సాధారణ సమావేశం నిర్వహించారు. అజెండాలోని 21 అంశాలను ఆర్‌ఓ అర్జున్‌రావు చదివి సభ్యులకు వినిపించారు. అన్ని అంశాలకు ఏకగ్రీవంగా సభ్యులు ఆమోదించారు. పలువురు కౌన్సిలర్‌లు తమకు రెస్ట్ రూమ్ ఏర్పాటు చేయాలని కమిషర్ దృష్టికి తీసుకువచ్చారు. అనంతరం పట్టణంలో కుక్కల బెడద ఎక్కువగా ఉందని నివారణకు చర్యలు తీసుకోవాలని చైర్మన్‌ను కోరారు. సీసీ రోడ్లు, డ్రైనేజీలు నిర్మించనున్నట్లు తెలిపారు. పలు చోట్ల కొత్త విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసిన అవి నిరుపయోగంగా ఉన్నాయని వాటికి లైన్ ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని సభ్యులు కోరారు. కౌన్సిలర్‌లు, కోఆప్షన్ సభ్యులు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

సాధారణ పిల్లలతో సమానంగా పెంచాలి

బల్లికురవ: వైకల్య చిన్నారుల పట్ల వివక్షత చూపకుండా సాధారణ పిల్లలతో సమానంగా పెంచాలని ఫిజియోథెరపిస్టు ఇందిరా ప్రియదర్శిని కోరారు. బుధవారం బల్లికురవలోని భవిత కేంద్రంలో జరిగిన ఫిజియోథెరపి క్యాంపులో మాట్లాడారు. ప్రభుత్వం పదోతరగతి పరీక్షలో పాస్ మార్కులు తగ్గించిదని పాఠశాలకు పంపాలని తల్లిదండ్రులకు సూచించారు. ఐఈఆర్టీ నాగబాబు, నాజిలి పాల్గొన్నారు.

ఏపీఎం సుబ్బారావు సేవలు ప్రశంసనీయం

చీరాల టౌన్: మండలంలో మహిళా పొదుపు సంఘాలను బలోపేతం చేయడంతో పాటు వారి ఆర్థికాభివృద్ధికి ఏపీఎం గద్దె పెద్ద సుబ్బారావు చేసిన సేవలు ఎనలేనివని నూతన ఏపీఎం మధుసూదనరావు కొనియాడారు. బుధవారం బుర్లవారిపాలెంలోని ఐకేపీ కార్యాలయంలో చీరాల నుంచి బదిలీపై వెళ్లిన ఏపీఎం సుబ్బారావు, ఇతర సిబ్బందికి వీడ్కోలు పలికారు. పలువురు మాట్లాడుతూ వరుసగా మూడు సార్లు ఉత్తమ ఏపీఎంగా మంత్రులు, కలెక్టర్లతో అవార్డు అందుకున్న ఏపీఎం సుబ్బారావు చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో సీసీలు కవిత, బుజ్జి, స్త్రీనిధి మేనేజర్ కామేశ్వరి, మండలంలోని వీపీవోలు, పొదుపు సంఘాల లీడర్లు, ప్రజలు పాల్గొన్నారు.

దీపావళి ధమాకా!



బాణసంచా సామగ్రి



ఎన్‌ఆర్‌పీఎం హైస్కూల్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన బాణసంచా దుకాణాలు

- ఎన్‌ఆర్‌పీఎం హైస్కూల్ గ్రౌండ్స్‌లో బాణసంచా దుకాణాలు
- గతేడాది కంటే ధరల పెరుగుదల

చీరాల అర్బన్: కులమతాలకు అతీతంగా దీపావళి జరుపుకునేందుకు చీరాల, అద్దంకి నియోజకవర్గాల్లోని ప్రజలు సన్నద్ధమవుతున్నారు. అయితే గత ఏడాది కంటే బాణాసంచా ధరలు ఆకాశాన్నంటాయి. చీరాల ఎన్‌ఆర్‌పీఎం హైస్కూల్ ఆవరణలో లైసెన్స్ దుకాణాలను ఏర్పాటు చేశారు. అలాగే చీరాల, పర్చూరు నియోజకవర్గాల్లో హోల్‌సేల్ షాపులున్నాయి. చీరాల మున్సిపాలిటీ పరిధిలో ఎన్‌ఆర్‌పీఎం హైస్కూల్ గ్రౌండ్‌లో 31 షాపులు, జాండ్రపేటలో 7, వేటపాలెంలో 2 షాపులకు అనుమతులిచ్చారు. వీటితో పాటు హోల్‌సేల్ షాపులు నాలుగున్నాయి. గత ఏడాది కంటే ఈ సంవత్సరం బాణసంచా సామగ్రి ధరలు 20 శాతం మేర పెరిగాయని వ్యాపారులు చెబుతున్నారు. బుధవారం నుంచి అమ్మకాలు ప్రారంభమయ్యాయి. అలానే హోల్ సేల్ షాపుల వద్ద వారం రోజులు ముందుగానే కొనుగోలుదారులు బాణసంచా కొనుగోలు చేస్తున్నారు.



గ్రౌండ్స్‌లో ఏర్పాటు చేసిన అగ్నిమాపక కేంద్రం ఔట్ పోస్టు

ధరలు ఇలా..

స్టాండర్డ్ కంపెనీ చిచ్చుబుడ్డి రూ.500, భూచక్రాలు రూ.270, కాకరకడ్డీలు రూ.25 చొప్పున అమ్మకాలు చేస్తున్నారు. గత ఏడాది కంటే 20 శాతం ధరలు పెరిగాయి. రిటైల్ షాపుల కన్నా హోల్‌సేల్ షాపుల వద్దకే ఎక్కువ మంది వెళుతున్నారు. దీపావళి పండుగ అంటే ముందుగా గుర్తుకు వచ్చేది మట్టి ప్రమిదలు. వీటి అమ్మకాలు కూడా ఎక్కువగా జరుగుతున్నాయి. గ్రౌండ్స్‌లో ఏర్పాటు చేసిన బాణసంచా దుకాణాల వద్ద ఎటువంటి అగ్నిప్రమాదం జరగకుండా ముందస్తుగా అగ్నిమాపక సిబ్బంది ఔట్‌పోస్టును ఏర్పాటు చేశారు. అగ్నిప్రమాదం జరిగితే అప్రమత్తమయ్యేందుకు అగ్ని నిరోధకాలను సిద్ధం చేసి ఉంచారు.

బాణసంచా కాల్చే సమయంలో జాగ్రత్తలు పాటించాలి



సరైన జాగ్రత్తలు పాటిస్తే పండుగను సంతోషంగా జరుపుకోవచ్చు. బాణసంచా కాల్చే సమయంలో చిన్నపిల్లల పట్ల తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలి. కాళ్లకు చెప్పులు ధరించాలని, కాలినవి, పేలని బాణసంచా పట్టుకోవద్దు. నైలాన్, పాలిస్టర్ కాకుండా కాటన్ దుస్తులు ధరించాలి. ఆరుబయట పూరిళ్లు, గడ్డివాములు లేని ప్రాంతాల్లో కాల్చాలి. ఏదైనా ప్రమాదం జరిగితే సమీపంలోని అగ్నిమాపక కేంద్రం 08594–232299 నంబర్‌ను సంప్రదించాలి. పొరపాటున శరీరానికి నిప్పు అంటుకుంటే పరిగెత్తకుండా నేలపై దొర్లాలి. కాలిన ఒంటిపై చల్లనీరు పోసి ఆస్పత్రికి తరలించాలి.

– వీవీ రామకృష్ణ సహాయ జిల్లా అగ్నిమాపక అధికారి

ఉక్కుమనిషి వల్లభాయ్ పటేల్

మార్టూరు: ఉక్కుమనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ జన్మదినోత్సవ సందర్భంగా జాతీయ ఐక్యతా దినోత్సవాన్ని మార్టూరులోని మద్ది సత్యనారాయణ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ వస్రామ్ నాయక్, ప్రధానోపాధ్యాయురాలు రూత్ మెర్సీ జాయ్.. వల్లభాయ్ పటేల్ చిత్రపటానికి నివాళులర్పించారు. ఉపాధ్యాయులు పల్లె పోగు శేషగిరిరావు చట్టి శ్రీనివాసరావు, మిల్టన్ కోటేశ్వరరావు, రాధ, తుర్లపాటి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పటేల్ ఆదర్శనీయుడు

జె.పంగులూరు: సర్దార్ వలభాయ్ పటేల్ స్వాతంత్ర సమరయోధుడే కాక, స్వాతంత్ర్యానంతరం సంస్థానాలను దేశంలో విలీనం చేయడానికి ఎంతో కృషి చేశారని.. ఎంపీడీఓ కె. స్వరూపరాణి అన్నారు. పంగులూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం పటేల్ జన్మదినం సందర్భంగా రాష్ట్రీయ ఏక్త దివాస్ కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులచే ప్రతిజ్ఞ చేసి మానవహారం నిర్వహించారు. ఏంఈఓ వీరాంజనేయులు, హెచ్‌ఎం రమాదేవి పాల్గొన్నారు.



పంగులూరులో ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

అద్దంకి రూరల్: పటేల్ జన్మదినం సందర్భంగా జాతీయ సమైక్యతా దినోత్సవాన్ని ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఎంపీడీవో కార్యాలయం నుంచి పాత బస్టాండ్ మీదుగా బాలికల ఉన్నత పాఠశాల వరకు సమైక్యతా ర్యాలీ నిర్వహించారు. తహసీల్దార్ శ్రీచరణ్, మున్సిపల్ కమిషనర్ రవీంద్ర, ఎంఈవోలు గంగాధర్, సుధాకరరావు, ఎంపీడీవో కార్యాలయ జూనియర్ అసిస్టెంట్ భరత్ కుమార్, పీడీ సుబ్బారావు, ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఇంటి పన్ను వసూళ్లు వేగవంతం చేయాలి

చీరాల టౌన్: గ్రామాల్లో పేరుకుపోయిన ఇంటి పన్ను వసూళ్లను వేగవంతం చేయాలని ఎంపీడీవో శివ సుబ్రమణ్యం పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో మండలంలోని గ్రామ పంచాయతీల కార్యదర్శులతో సమావేశాన్ని నిర్వహించి మాట్లాడారు. పంచాయతీల్లో పలు సమస్యల పరిష్కారానికి పన్ను దోహదపడుతుందని చెప్పారు. డిసెంబర్ 20వ తేదీలోపు పన్ను వసూళ్లు వందశాతం పూర్తి చేయాలని కార్యదర్శులకు సూచించారు. గ్రామాల్లోని ప్రజలు రోగాల బారిన పడకుండా ఉండాలంటే గ్రామాలన్నీ సుందరంగా ఉండాలని, పారిశుద్ధ్య నిర్వహణ సక్రమంగా చేసి గ్రామాలను రోగాల నుంచి కాపాడాలన్నారు. పంచాయతీలకు కేటాయించిన నిధులను సక్రమంగా వినియోగించి రోజువారీగా పారిశుద్ధ్య సమస్యలను లేకుండా చేయాలన్నారు. తాగునీటి సమస్య పరిష్కారానికి వాటర్ ట్యాంకులు, ఆర్వో ప్లాంట్ల మరమ్మతులు చేయించి మంచినీరు ప్రజలకు అందించాలన్నారు. పంచాయతీల కార్యదర్శులు, సచివాలయాల కార్యదర్శులున్నారు.

రోడ్డును హైవేకు అనుసంధానం చేయాలి

చినగంజాం: మండల కేంద్రమైన చినగంజాం రైల్వే లెవల్ క్రాసింగ్ గేటు తీవ్ర సమస్యగా ఉందని.. దానిని పరిష్కరించాలని కో ఆప్షన్ సభ్యుడు అధికారులను కోరారు. బుధవారం జరిగిన మండల సర్వసభ్య సమావేశం అనంతరం ఎంపీపీ కోమట్ల అంకమ్మరెడ్డి సమక్షంలో తహసీల్దార్ జీవీగుంట ప్రభాకరరావు, ఎంపీడీఓ ఏవీ శ్రీనివాసమూర్తికి వినతి పత్రం అందజేశారు. మండల కేంద్రమైన చినగంజానికి సుమారు 10 గ్రామాలు అనుసంధానమై ఉన్నాయన్నారు. అలాగే సోపిరాల గ్రామ సమీపంలో రెండు రైల్వేగేట్లు ఉన్నాయని తెలిపారు. అయితే ఈ గేట్లు వేసిన సమయంలో సుమారు అరగంటకు పైగా వాహనదారులు వేచి ఉండాల్సి వస్తోందని వివరించారు. అత్యవసర వైద్యచికిత్సలను సకాలంలో అందుకోలేక చాలా నష్టాన్ని చవిచూస్తున్నారని తెలిపారు. అందుకే ప్రత్యామ్నాయ మార్గాలు చూడాల్సిన అవసరం ఉందని చెప్పారు. లలితా రామకోటేశ్వర స్వామి ఆలయం మీదుగా ఉన్న రోడ్డు హైవేకు అనుసంధానం చేసేందుకు అవకాశం ఉందన్నారు. గుంతల రోడ్డును బాగు చేసి సమస్యలను తొలగించాలని కోరారు.



అధికారులకు వినతి పత్రం అందజేస్తున్న కో ఆప్షన్ సభ్యుడు మహ్మద్

మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్‌గా రుద్ర కుమార్

చీరాల రూరల్: మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్‌గా న్యాయవాది బొడ్డు రుద్ర కుమార్ ఎన్నికయ్యారు. బుధవారం మున్సిపల్ కార్యాలయంలోని మున్సిపల్ కౌన్సిల్ హాలులో జరిగిన సమావేశంలో న్యాయవాది రుద్ర కుమార్‌ను కౌన్సిల్ మెజారిటీ సభ్యుల ఆమోదం మేరకు ఎన్నుకున్నారు. వేటపాలెం మండలం దేశాయిపేటకు చెందిన రుద్ర కుమార్ గత 22 సంవత్సరాలుగా చీరాల కోర్టులో న్యాయవాదిగా ప్రాక్టీసు చేస్తున్నారు. తోటి న్యాయవాదులు అభినందించారు.

మహనీయుల అడుగుజాడల్లో నడవాలి

చీరాల టౌన్: మహనీయుల ఆశయాలు, లక్ష్యాలను ప్రతి విద్యార్థి అలవర్చుకుని చక్కగా చదువుకుని జీవితంలో ఉన్నతస్థాయికి ఎదగాలని చీరాల ఆర్డీవో పి.చంద్రశేఖరనాయుడు సూచించారు. బుధవారం బీవీ అండ్ బీఎన్ హైస్కూల్లో కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి పురస్కరించుకుని రాష్ట్రీయ ఏక్తా దివస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. హైస్కూల్ విద్యార్థులతో కలిసి అధికారులు, ప్రజలు, ఉపాధ్యాయులు గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. స్కూల్ ఆవరణలో మానవహారాన్ని ఏర్పాటు చేశారు. ఆర్డీవో మాట్లాడుతూ విద్యార్థులంతా ఐక్యమత్యంతో జీవించి ప్రణాళికాబద్ధంగా చదువుకుని లక్ష్యాన్ని ఎంచుకుని ఎదగాలన్నారు. చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని, పేద వర్గాలకు అండగా ఉండాలని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ కుర్రా గోపీకృష్ణ, ఎంపీడీఓ శివసుబ్రమణ్యం, పంచాయతీ సెక్రటరీ శ్రీను, సచివాయాల సిబ్బంది, ఉపాధ్యాయులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

దోమల నివారణ చర్యలు ప్రారంభం

కారంచేడు: వరుసగా వర్షాలు వచ్చిన నేపథ్యంలో దోమలు ఉధృతంగా వ్యాప్తి చెందడంతో పాటు, పలు విష జ్వరాలు ప్రబలే అవకాశం ఉంది. దీంతో లోతట్టు ప్రాంతాల్లో ఎబేట్ ద్రావణాన్ని పిచికారీ చేయిస్తున్నట్లు కారంచేడు పీహెచ్‌సీ డాక్టర్ గోరంట్ల సురేష్‌బాబు తెలిపారు. బుధవారం కారంచేడు ఆర్‌సీఎం చర్చి సమీపంలోని ప్రాంతాల్లో ఆయన గ్రామ పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులతో దోమల నివారణకు ఈ చర్యలు చేపట్టారు. తాగి పడేసిన కొబ్బరిబోండాలు, టీ కప్పులు, పూల కుండీలు, వాడని టైర్లు వంటివి ఉంటే వెంటనే తొలగించుకోవాలని తెలిపారు. హెచ్‌వీ వీరమ్మ, హెచ్‌ఎస్ శ్రీనివాసరావు, ఎల్‌టీ సుబ్బారావు, జగదీశ్వరి, భవానీ, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.



కారంచేడులో ఎబేట్ ద్రావణాన్ని పిచికారీ చేయిస్తున్న డాక్టర్ సురేష్‌బాబు

ఎలక్ట్రీషియన్ కుటుంబాన్ని ఆదుకోండి

వేటపాలెం: విద్యుదాఘాతంతో మరణించిన ఎలక్ట్రీషియన్ దానియేలు కుటుంబాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ చల్లారెడ్డిపాలెం గ్రామ సచివాలయం–2 దగ్గర సీఐటీయూ ఆధ్వర్యంలో బుధవారం ధర్నా నిర్వహించారు. జిల్లా ఉపాధ్యక్షుడు ఎం. వసంతరావు మాట్లాడుతూ పంచాయతీలో పనిచేస్తున్న సారికొక్కు దానియేలు ప్రమాదవశాత్తు కరెంట్ షాక్ తగిలి చని పోవడం బాధాకరమన్నారు. గత 15 ఏళ్లగా పంచాయతీలో పనిచేస్తున్న ఆయన.. వృత్తిలో భాగంగా వీధి లైట్లు మరమ్మతులు చేస్తున్న సమయంలో అకస్మాత్తుగా విద్యుత్ సరఫరా జరిగి స్తంభంపై ఉండగానే ప్రాణాలు విడిచాడన్నారు. దానియేలుకు భార్య, పిల్లలున్నారని తెలిపారు. బాధిత కుటుంబానికి రూ. 20 లక్షల నష్టపరిహారంతో పాటు భార్యకి ఉద్యోగం ఇవ్వాలని కోరుతూ సచివాలయ సెక్రటరీ వినయ్‌కి వినతిపత్రం అందజేశారు. ఏపీ పంచాయతీ వర్కర్స్ యూనియన్ నాయకులు బ్రహ్మయ్య, కృపమ్మ, కుమారి పాల్గొన్నారు.



సచివాలయం వద్ద ధర్నా చేస్తున్న సీఐటీయూ నాయకులు

ఎంపీడీఓ పరామర్శ

దానియేలు కుటుంబ సభ్యులను ఎంపీడీఓ రాజేష్ బాబు బుధవారం పరామర్శించారు. ప్రభుత్వం పరంగా కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకుంటామని కుటుంబ సభ్యులకు హామీ ఇచ్చారు. అలాగే విద్యుత్ శాఖ ఏడీఈ శ్రీనివాసరావు మృతుని కుటుంబాన్ని పరామర్శించారు. నష్ట పరిహారం అందే విధంగా కృషి చేస్తానన్నారు.

గోవులకు రక్షణ కల్పించాలి



మున్సిపల్ కమిషనర్‌కు వినతి పత్రం అందిస్తున్న గో పరిరక్షణ సమితి సభ్యులు

చీరాల రూరల్: రోడ్లపై అనాథలుగా సంచరిస్తున్న గోవుల రక్షణకు చర్యలు తీసుకోవాలని గోపరి రక్షణ సమితి ఆధ్వర్యంలో సభ్యులు బుధవారం మున్సిపల్ కమిషనర్‌కు వినతి పత్రం అందజేశారు. చీరాల పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో గోవులు విచ్చలవిడిగా సంచరిస్తున్నాయని, వాటి యజమానులు కావాలనే రోడ్లపై వదిలేస్తున్నారని తెలిపారు. రోడ్లపై సంచరిస్తూ ట్రాఫిక్‌కు కారణం అవుతున్నాయని తెలిపారు. మరికొంతమంది గోవులను ఇళ్లకు తరలించుకెళుతూ డబ్బులకు విక్రయిస్తున్నారని కమిషనర్ దృష్టికి తీసుకువచ్చారు. గో పరిరక్షణ కమిటీ సభ్యులు గుమ్మా బాలాజీ, పందరబోయిన ఆంజనేయులు, గోపికృష్ణ, పొదిలి రవికుమార్, సాయి శ్రీనివాస్‌లు పాల్గొన్నారు.

శాఖల సమన్వయంతో అభివృద్ధి

చినగంజాం: మండలంలోని అన్ని శాఖల సమన్వయంతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని మండల తహసీల్దార్ జీవిగుంట ప్రభాకరరావు అన్నారు. మండల సర్వసభ్య సమావేశం మండల పరిషత్ సమావేశ భవనంలో బుధవారం ఎంపీపీ కోమట్ల అంకమ్మ రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. సమావేశం రెండు గంటలపాటు సాగగా మండల పరిధిలోని అన్ని శాఖల అధికారులు తమ శాఖల పరిధిలోని అభివృద్ధి పనులు గురించి వివరణ ఇస్తూ.. సమీక్ష నిర్వహించారు. వ్యవసాయం, ఇందిరా క్రాంతి పథం, విద్య, వైద్యం, అంగన్‌వాడీ, గ్రామీణ నీటి పారుదల, ఇరిగేషన్, డ్రైనేజ్, గృహనిర్మాణం, విద్యుత్, ఉపాధి హామీ, పంచాయతీ రాజ్ వంటి పలుశాఖలకు సంబంధించిన అధికారులు సమావేశంలో పాల్గొని మాట్లాడారు. అంగన్‌వాడీ కేంద్రాల వద్ద పరిసరాలు అపరిశుభ్రత నెలకొంటుందని, మూలగాని వారిపాలెం పాఠశాల భవనం కూలే స్థితిలో ఉందని, గృహ నిర్మాణ లబ్ధిదారులకు బిల్లులు చెల్లించక పోవడంతో ఇబ్బందులు పడుతున్నారని వంటి పలు సమస్యలను కొత్తపాలెం సర్పంచ్ ఆసోది బ్రహ్మానందరెడ్డి అధికారుల దృష్టికి తీసుకొని వచ్చి పరిష్కారం చేయాలని కోరారు. మండలంలోని కృష్ణా డెల్టా చివరి ఆయకట్టు భూములకు నీరు అందడం లేదని, పంట కాలువలు, డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేదని, తద్వారా భారీ వర్షాలు సంభవించినప్పుడు వాగులు పొంగి గ్రామాలకు సంబంధాలు తెగిపోతున్నాయని చెప్పారు. ఉప్పుగుండూరు రైల్వే వంతెన కింద భారీగా నీరు చేరి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, విద్యుత్ సమస్య తలెత్తినప్పుడు రోజుల తరబడి కరంటు లేక ఇబ్బందులు పడుతున్నామని నీలాయపాలెం సర్పంచ్ తూమాటి శ్రీనివాసరావు సభ దృష్టికి తీసుకొని వచ్చారు. అడివీధిపాలెం పాఠశాల అభివృద్ధికి నిధులు కేటాయించాలని మోటుపల్లి సర్పంచ్ వడ్లమూడి సాంబశివరావు కోరారు. ఆధార్ కార్డు లేక పలువురు ఎస్టీలు ఇబ్బందులు పడుతున్నారని వారి సమస్యను తొలగించాలని కో ఆప్షన్ సభ్యుడు మహ్మద్ అధికారులను కోరారు. ఇదే విధంగా పలువురు ప్రజా ప్రతినిధులు ఆయా గ్రామాల్లో నెలకొన్న సమస్యల గురించి మాట్లాడారు. మండల ఉపాధ్యక్షుడు కాటుకూరి బాబురావు, ఎంపీడీఓ ఏవీ శ్రీనివాసమూర్తి, ఈఓపీఆర్డీ బి. సుబ్బారావు, గ్రామ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, గ్రామ కార్యదర్శులు, సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



మండల సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు

సమస్యలు పరిష్కరించండి

- మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో కౌన్సిలర్ల ఏకరువు
- 19 అంశాల్లో ఒక అంశం వాయిదా.. మిగిలినవాటికి ఆమోదం



సమావేశంలో మాట్లాడుతున్న కౌన్సిలర్లు

చీరాల అర్బన్: వార్డుల్లో సమస్యలు పెరిగిపోతున్నాయి. ప్రజలు తమ దృష్టికి తీసుకువచ్చిన సమస్యలను మున్సిపల్ అధికారులకు చెప్పినా.. అవి పరిష్కారానికి నోచుకోవడం లేదంటూ మున్సిపల్ కౌన్సిలర్లు కౌన్సిల్ సమావేశంలో ఏకరవు పెట్టారు. బుధవారం స్థానిక మున్సిపల్ కౌన్సిల్ హాలులో కౌన్సిల్ సాధారణ సమావేశాన్ని మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు అధ్యక్షతన నిర్వహించారు. వార్డుల్లో పలు సమస్యలను ప్రజలు తమ వద్దకు తీసుకువస్తున్నారని, వాటిని పరిష్కరించడంలో మున్సిపల్ అధికారులు దృష్టి సారించడం లేదని తెలిపారు. కౌన్సిలర్ గోలి స్వాతి మాట్లాడుతూ తమ వార్డులో చెత్తాచెదారంతో పూర్తిగా నిండిపోయిందని వాటిని సకాలంలో తీసివేయడం లేదన్నారు. అలానే వార్డులో చేపట్టిన అభివృద్ధి పనులకు సంబంధించి కాంట్రాక్టు తీసుకున్న వారు పనులు సకాలంలో పూర్తి చేయడం లేదని చైర్మన్ దృష్టికి తీసుకువచ్చారు. కౌన్సిలర్ మామిడాల రాములు మాట్లాడుతూ కూరగాయల మార్కెట్, బెస్తపాలెం వద్ద సంచార జాతుల వారు చిన్న చిన్న దుకాణాలు ఏర్పాటు చేసుకోవడం వలన రోడ్డు ఆక్రమణలకు గురవుతోందని, వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. వారికి ప్రత్యామ్నాయంగా మరొక ప్రాంతాన్ని కేటాయించి వ్యాపారస్తులకు ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. కౌన్సిలర్ సత్యానందం మాట్లాడుతూ దండుబాట నుంచి ఐక్యనగర్‌కు వెళ్లే మార్గంలో కొబ్బరిబోండాలు రోడ్డు పక్కన వేస్తున్నారని, వాటి వలన దోమలు వ్యాప్తి చెందకుండా.. అటువంటి వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. ఆ ప్రాంతంలోనే రోడ్డు పక్కన చిల్లచెట్లు ఎక్కువగా ఉండడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. దీనిపై స్పందించిన కమిషనర్ అబ్దుల్ రషీద్ మాట్లాడుతూ ఆ ప్రాంతంలో కొన్ని ఖాళీ స్థలాలు కూడా ఉండటంతో వారికి కూడా నోటీసులు ఇచ్చామన్నారు. పొక్లెయిన్ ద్వారా చిల్లచెట్లను తొలగిస్తామన్నారు. కౌన్సిలర్ మల్లెల లలిత మాట్లాడుతూ వీధిలైట్లు సరిగా వెలగడం లేదని, లైట్లు ఏర్పాటు చేసి మూడు నెలలకే పనిచేయడం లేదన్నారు. కౌన్సిల్‌లో కౌన్సిలర్లు లేవనెత్తిన సమస్యలపై సంబంధిత అధికారులు వెంటనే స్పందించి సమస్యలను పరిష్కరించాలని చైర్మన్ జంజనం శ్రీనివాసరావు అధికారులకు సూచించారు. అనంతరం అజెండాలోని అంశాలపై చర్చ నిర్వహించారు. అజెండాలోని మొదటి అంశమైన విజయవాడ తూర్పు మాజీ ఎమ్మెల్యే వంగవీటి మోహనరంగా కాంస్య విగ్రహాన్ని చీరాల పట్టణంలో ఏర్పాటు చేయాలని కోరుతూ విగ్రహ ప్రతిష్టాపన కమిటీ దరఖాస్తు చేయగా ఆ అంశంపై కౌన్సిల్ సభ్యులంతా చర్చించి నిర్ణయం తీసుకుంటామని చెప్పడంతో ఆ అంశాన్ని వాయిదా వేశారు. అలానే మిగిలిన 18 అంశాలను కౌన్సిల్ ఆమోదించింది. సమావేశంలో మున్సిపల్ డీఈ, శానిటరీ ఇన్‌స్పెక్టర్, కౌన్సిలర్లు, కో–ఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థినులకు సైకిళ్ల అందజేత



ఇంకొల్లులో బాలికలకు సైకిళ్లు అందిస్తున్న రోటరీ సభ్యులు

పర్చూరు (చినగంజాం): దాతలు అందిస్తున్న ఆర్థిక సహాయ సహకారంతో విద్యార్థినులు చదువులో రాణించాలని పర్చూరు విద్యాశాఖాధికారి వెంకటరామయ్య సూచించారు. పర్చూరు రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో బుధవారం విద్యార్థినులకు సైకిళ్లు పంపిణీ చేశారు. రోటరీ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ నార్త్ ఆర్థిక సహకారం చేకూర్చింది. పర్చూరు, చెరుకూరు, జాగర్లమూడి, అన్నంబొట్లవారిపాలెం గ్రామాల్లోని వారికి బహూకరిస్తున్నట్లు రోటరీ క్లబ్ అధ్యక్షుడు తోకల కృష్ణమోహన్ తెలిపారు. అనంతరం ఎంఈఓ వెంకటరామయ్యను క్లబ్ అధ్యక్షుడు కృష్ణమోహన్, సభ్యులు ఘనంగా సన్మానించారు. కోమటి ఆంజనేయులు, కోట శ్రీనివాసరావు, నాగబైరు శ్రీనివాసరావు, పాబోలు ఉదయభాస్కర్, పంబి సదానందరెడ్డి, పోలిశెట్టి చంద్రం, కారుమూడి సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

అద్దంకి రూరల్: రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ ఆధ్వర్యంలో 7గురు విద్యార్థినులకు స్థానిక ప్రకాశం బాలికల ఉన్నత పాఠశాలలో బుధవారం సైకిళ్లు అందజేశారు. ఎంఈవో గంగాధరరావు మాట్లాడుతూ విద్యార్థినులు చదువులో ముందుండాలన్నారు. చప్పిడి వీరయ్య, చుండూరి మురళీసుధాకరరావు, మలాది శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఇంకొల్లు (చినగంజాం): రోటరీ క్లబ్ ఆఫ్ హైదరాబాద్(నార్త్) వెల్‌జెన్, రోటరీ క్లబ్ ఆఫ్ ఇంకొల్లు (సెంట్రల్) ఆధ్వర్యంలో బుధవారం ఇంకొల్లులో బాలికలకు సైకిళ్లు పంపిణీ చేశారు. ఇంకొల్లు ఎస్ఆర్ అండ్ వీఎస్ఆర్ హైస్కూల్ విద్యార్థినులు ఐదుగురు అందుకున్నారు. హెచ్‌ఎం రావి నాగేశ్వరి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో షేక్ రఫీ, సెక్రటరీ చుండి సాంబశివరావు, అలవల రాఘవరెడ్డి, సోమేపల్లి రామ్మోహనరావు పాల్గొన్నారు.

బ్యాడ్మింటన్‌లో ప్రతిభ

చీరాల రూరల్: చీరాలకు చెందిన షటిల్ బ్యాడ్మింటన్ క్రీడాకారుడు షేక్ న్యుమేర్ ఇంటర్ యూనివర్సిటీ బ్యాడ్మింటన్ చాంపియన్ షిప్ పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరచి యూనివర్సిటీ చాంపియన్ షిప్ సాధించాడు. ఈనెల 26 నుంచి 29 వరకు చెన్నైలోని ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో ఇంటర్ యూనివర్సిటీ బ్యాడ్మింటన్ చాంపియన్ షిప్ పోటీలు జరిగాయి. అమరావతిలోని ఎస్ఆర్ఎం యూనివర్సిటీకి చెందిన బ్యాడ్మింటన్ క్రీడా జట్టుకు షేక్ న్యుమేర్ ప్రాతినిధ్యం వహించాడు. చెన్నై ఎస్ఆర్ఎం యూనివర్సిటీ జట్టుపై అమరావతి ఎస్ఆర్ఎం యూనివర్సిటీ జట్టు 3–2 తేడాతో విజయకేతనం ఎగురవేసి సౌత్‌జోన్ ఇంటర్ యూనివర్సిటీ చాంపియన్ షిప్ సాధించింది.



30సిహెచ్ఆర్ఎల్91: షేక్ న్యుమేర్